# 34. ఒరవడి

**మాట్లాడ** కుండానే కడుపునిండా భోంచేసి వీధి. పట్టాడు సుబ్రమణ్యం. జీవితమే దుర్భర మనిపించ సాగిందతనికి.

ఒకరోజల్లా శారదతో మాట్లాడకుండా వుండడం ఇంతకి ముందెప్పుడూ జరగలేదు. పట్టలేని ఆలోచనల్తో ఆతను బరువుగా కదుల్తున్నాడు.

ఎన్నిసార్లు ఆలోచించినా అతనికి తను చేసింది తప్పని అనిపించడమే లేదు.

నిన్న ఉదయం :

శారద ఎనిమిది కల్లా ఉప్మా చేసింది.

సుబ్రమణ్యం ఉషారుగా ఉన్నాడు. అప్పుడే వచ్చిన ఒచ్చీ వారం వారపత్రిక పుచ్చుకొని పీటమీద కూచుని ఓ రవ్వ తిననూ ఓ పేజీ తిప్పనూ మధ్య మధ్య వో కార్టూను శారదకి చూపించనూ ఓజోకు తన్లో తనే చదువుకొని నవ్వనూ; యిలా చేస్తున్నాడు.

శారద కంగారుగా తినేస్తోంది. అవసరమైనప్పుడు అతని వేపు చూస్తూ. అప్పుడే ఎనిమిదయి పోయింది. ఇంకా కాఫీ కలపాలి. యీ ప్లేట్లూ ఆ గిన్నెలూ కడుక్కోవాలి. ఇవన్నీ ఎప్పుడవుతాయి? పదింటికి వంటవుతుందో లేదో - అనుకుంటూ !

శారద హడావుడిగా తనప్లేటు కాళీచేసి కాఫీ కలిపేసి గ్లాసులో పోసేసి సుబ్రమణ్యం వేపు చూస్తూ అతను ప్లేటూ గ్లాసూ ఎప్పుడిస్తాడా అని ఎదురుచూస్తూ కూచుంది.

పుస్తకం చూస్తున్న సుబ్రమణ్యం వుండుండి పగలబడి నవ్వుతూ "యిది చూసేవా," అని చెప్పడం ప్రారంభించాడు.

ఒకసారి చూసీడం నించి అతను తొందరగా చెప్ప గలిగాడు. సావధానంగా వినకపోడం వల్ల శారదకి అది అర్థం కాలేదు.

"ఏమిటి ?" అంది.

మళ్లీ చెప్పాడు సుబ్రమణ్యం; సగం వుత్సాహం చచ్చి .

శారదకు మళ్ళీ అర్థం కాలేదు.

" అయితే ఏమిటి, ఇంతకీనూ! "

"ఛీ!" అని, సుబ్రమణ్యం; శారద చెంప అందుబాట్లో వుంటేను, హేళనా విసుగూ విమర్శా మేళవించి ఒక్కటంటే ఒక్కటికొట్టాడు.

"ఛీ ! ....... - కొడుతున్నారు కూడానేమిటీ?" అని శారద లేచి నిలబడింది.

వెధవ్వార పత్రికలో జోకు బోధపడనంత మాత్రాన కొట్టాలా - అని అవమానం చెందిందామె.

ఆ స్వరంలోని ఛీత్కారం భర్తయిన సుబ్రమణ్యాన్నీ అవమానించింది. దిగ్గున లేచాడు.

తన ఉప్మా సగందాకా వుండి పోయిందిన్నీ వొదిలి. చేతిలో పుస్తకం విసిరికొట్టగా కాఫీ గ్లాసుకి తగిలి వొలికిపోయింది కూడాను.

నించున్నది నించునట్టుగానే నిర్ఘాంతపడిపోయింది శారద. జరిగిందేదీ మెదడులో యిమడకుండా ఉంది.

కాపరానికొచ్చి ఆరేళ్లయింది. గట్టిగా కసరనైనా కసరని మొగుడు యివాళ అనుకోకుండా చాలా చిన్న విషయం మీద మేఘం లేని మెరుపులా కొట్టి వెళ్ళాడంటే నిజమేనా అనిపిస్తోంది.

ఇంకా చుర్రుమంటూనూ వుంది.

సుబ్రమణ్యానికి యిబ్బందిగా వుంది. అనేక విషయాల్లో శారద తనకి సమానురాలు కాదు. తనతో తూగలేదు. ఎంత అగ్రహారంలో పుట్టిందైతే మట్టుకు పాతికేళ్ళు వెళ్ళి యిద్దరు పిల్లలుపుట్టి యింత సంసారం చేసి యిన్నివూళ్ళు తిరగేక కొంతలోకజ్ఞానం రావాలి; అదీ వొచ్చినట్టు కనబడదు. తెల్లార్లేస్తే వీధిలో కనబడ్డ పుస్తకమల్లా ఇంట్లో వుంటుంది. అంత చదువురాని మొద్దుకాదు; చదువుతూనే వుంటుంది. ఒకసారిచెపితే అర్థం కాకపోవచ్చు కాని రెండు సార్లు చెబితే అర్థంకానిది అందులో ఏముందిగనక:

అది వొక మూర్ఖురాలి మూర్ఖత్వం గురించిన పిట్టకథ. అదిన్నీ అర్ధం కానట్టి మూర్ఖురాలీమె.

పైగా కొట్టారన్న పౌరుషం వొకటి: తన పద్ధతులు నచ్చవు. ముప్ఫయియేళ్ళ క్రితం ఎక్కడో వైదికుల యింట్లో పుట్టినందుకు, దేశాలు తెగించి వుద్యోగాలమీద పొట్టచేత్తో పుచ్చుకొచ్చి రోజుకి ఆరుగంటలే బతుకుతున్న తనని వైదికాచారాలు యథావిధిగా పాటించమంటుంది.

ఆమెని మార్చాలని ప్రపంచాని కనుగుణంగా సరిదిద్దాలని తను చేసిన ప్రయత్నాలు వొకటొకటే వమ్మయి పోతున్నాయి. మింగి మింగి జీర్ణంకాని విసుగు యీనాడు తనకి లేని బలహీనతని ప్రదర్శింప జేసింది.

సుబ్రమణ్యం రోడ్డుమీద సాగుతున్నాడు. పనిలేకుండా ఆలోచనల్ని చంపుకోడానికి, తననుంచి తను దూరంగా పారిపోడానికి చేసేయత్నం ఎంతనెమ్మదిగా సాగుతుందో తెలుస్తూ వుంది. చదరంగం బల్లమీద దృష్టినిలిపితే ఎంత క్లిష్ట సమస్యనయినా మరిచిపోవచ్చునని అతనికి తెలుసు. పొద్దున ఒక ఆట రెండు గంటలాడారు. అతనూ నరశింహారావున్నూ.

భోజనం చేసి వస్తానని ఇంటికెళ్ళాడు సుబ్రమణ్యం. పోనీ ఇవ్వాళ్టికి ఇక్కడ భోంచెయ్యహోయ్ ఈ ఎండలో ఏం వెళ్తావు. శలవే కదా మర్రెండు గేమ్సు వేసుకుందాం- అన్నాడు నరశింహారావేమోను.

తనూ తన భార్యా స్వల్ప విషయం మీద మౌనం వహించి తీవ్రయుద్ధం సాగిస్తున్నట్టు ఎక్కడేనా తెలిసిపోతుందేమో అన్న అర్థంలేని అనుమానంతో, ఇంటికి వెళ్ళకపోడం మంచిదేనని పించినా, వెళ్ళివస్తున్నాడు.

జరిగిన, జరుగుతున్న విషయాల్ని క్రోడీకరించుకో లేక, మరిచిపోడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ నర్శింహారావు యిల్లు చేరాడు సుబ్రమణ్యం.

"లేరండీ - మీరలా వెళ్ళగానే ఎవరో పొరుగూరాయనట. పిల్చుకెళ్ళారండి-" అని వినిపించింది సన్నగా.

ఇంటికి వెళ్ళాలన్నమాట.

శారద తలుపు వేసుకుని నిద్రపోతూవుంటుందా?

ఈ ఎండాకాలం మధ్యాన్నం వొకటి మౌనంగా గడపడం అంతకష్టమైన పనికాదుగాని చొక్కావేసుకొని సాయంకాలంవరకూ సరిపడే సిగరెట్లూ తెచ్చుకోడం వల్లా "తిరిగే కాలు" కావడంవల్లా కాళ్ళు ఇంటివేపు లాగడంలేదు.

కాని ఇంటికెళ్ళక యీ ఎండలో ఇంకెక్కడికి వెళ్ళాలి! సోమరి రంగడిలా నీయింట వుండేదా, నీయింట వుండేదా అని సాటివారింట ఎన్నాళ్ళు తలదాచుకో గలడు గనక !

తలుపు తట్టాడు. తెరవడానికి శారద వొస్తోందని. స్ఫురించగానే యిటు తిరిగి సిగరెట్టు వెలిగించాడు సుబ్రమణ్యాం. గడియతీసి, తలుపు సన్నగా తీసి, ఒచ్చిన మనిషి యీనే అని తెలుసుకుని, ఆ వైఖరిచూసి అక్కసూ అసహ్యమూ పేరుకు పోయి అక్కడే నిలబడి పోయింది శారద.

తలుపు తీసిన మనిషి వెనక్కి వెళ్ళిన శబ్దం కాలేదు, అక్కడే వుందని గ్రహించి సుబ్రమణ్యాం యిటు తిరగనే లేదు.

తను అక్కడ నిలబడ్డంతసేపూ అతను లోపుకి రాడని గ్రహించడానికి శారదకి అట్టే సేపు పట్టలేదు. చిరుచప్పుడు చేస్తూ వెళ్ళింది; అవతలిగది ద్వారం దాకానూ. అక్కడ నుంచుంది.

సుబ్రమణ్యాం హాల్లోకొచ్చి చెప్పులు విడిచి యీజీ చైర్లో కూలబడ్డాడు.

గదిద్వారం వద్ద నిలబడ్డ శారద అతని వేపే చూస్తోంది. దగ్గిరే ఒక న్యూస్ పేపరు వుంటే విప్పాడు సుబ్రమణ్యాం. ఇక మొహం కనబడదు.

ఓ రెండు నిమిషాలు చూసింది శారద, తను మాట్లాడవలసిన అవుసరం ఏదో ఆమెని తొందర పెట్టింది.

"డఫేదారొచ్చివెళ్ళేడు..." అంది పొడిగా.

సుబ్రమణ్యాం న్యూస్ పేపరు అడ్డం తీశాడు. "విన్నాన్లే" అని దానర్థం.

"దొరగార్రమ్మన్నారని చెప్పి వెళ్ళేడు;"

పీల్చిన పొగ బైటికి వొదిలి నుసి దులిపాడు సుబ్రమణ్యాం. సమాధానం చెపుతాడో వివరం అడుగుతాడో అని వేచి వుంది శారద.

సమాధానం చెప్పడానికి ఏమీ లేదిందులో. ఉన్నా అది దొరగారికే.

వివరం అడగక్కర్లేదు, దొరగారు ఆదివారం రమ్మనడం దేనికో అతనికి బాగానే తెలుసు.

అందుకని సుబ్రమణ్యాం విధం చెడకుండా కూచున్నాడు.

"బావుంది వరస." అంది శారద.

సుబ్రమణ్యాం మాట్లాడలేదు.

"నేనేం చేసే నండీ- మాట్లాడ్డం కూడా మానుకున్నారూ?"

"... ... ... .."

"ఎన్నాళ్లిలా వుంటారో నేనూ చూస్తాను:......"

"...... ... ..."

'మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కిందట ! కొట్టడం మీరే అలకా మీరేనా ఏమిటి?...'

"... ... ..."

"ఎవరేనా వింటే నవ్వుతారండీ - ఏమిటీ వికారం?"

సుబ్రమణ్యం మాట్లాడకుండానే లేచాడు. "దొరగారి దగ్గిర కెళ్లడానికి" వేరే బట్టలు వేసుకున్నాడు. మాట్లాడకుండా చూస్తూ నించున్నది శారద. బూట్లు వేసుకుంటున్నాడు సుబ్రమణ్యం ఇహ వెళ్ళిపోతాడు.

"నన్ను అమాయకురాల్నిచేసి ఆడించడం అంతాను- నేనే అలగ వలసింది మీరు చేసిన్దానికి - నేను వెర్రిదాన్ని గనక-" అంది శారద.

"నోరు ముయ్యవోయ్. వెర్రిదాని వైతే పిచ్చాసుపత్రిలో నయినా జాయిన్ చేద్దును. ఇటు మంచీ గాక అటు వెర్రీగాక మధ్యలోపడి కొట్టుకుంటున్నావు. ఇప్పుడే చెప్తున్నాను. విను. నువ్వు రాత్రే చదువుతావో పగలే చదువుతావో పన్లే మానుకుంటావో నాకు తెలియదు. రెండేళ్లు టైమిస్తున్నాను. యీ రెండేండ్లలో నువ్ మెట్రిక్ పేసవ్వాలి నవ్వు. లేకపోతే-"

లేకపోతే-?

పేసయి-?

అలా అంటూ ఇలా అనుకుంటూ సుబ్రమణ్యం వీధిలోకి నడిచాడు.

✣ ✣ ✣

అది కలెక్టరు బంగళాలో ప్రయివేట్ రూమ్.

"ఏమయ్యా అలా వున్నావూ?" అని పలకరించాడు కలెక్టరు శాస్త్రి, సుబ్రమణ్యాన్ని కూచోమంటూ.

"ఏంలేదుసార్;" అంటూనే కూచున్నాడు సుబ్రమణ్యం.

"ఎండ వేడికా?" అని జవాన్ని కేకవేసి డ్రింకు కలిపి తీసుకు రమ్మన్నాడు శాస్త్రి.

ఆశ్చర్యంలేదు. కలెక్టరు శాస్త్రీ డిప్యూటీ తాసిల్దారు సుబ్రమణ్యమూ పదేళ్లకిందట ఒకే ఆంధ్ర యూనివర్శిటీలో ఆనర్సుక్లాసు చదువుకున్నారు. అదృష్టం శాస్త్రి మీద ఫస్టు క్లాసు మార్కులూ ఐ.ఏ.యస్. పంటా వర్షించింది; సుబ్రమణ్యానికి కవిత్వమూ గానమూ తృప్తీ ప్రసాదించింది.

ఈ జిల్లాకి శాస్త్రి కలెక్టరుగా వొచ్చిన దగ్గర్నుంచీ- ఇతరులు అపార్థం చేసుకుంటారని సుబ్రమణ్యం అనుకుంటున్నా- తమ స్నేహాన్ని ఏదో సందర్భం చూసి జ్ఞాపకం చేస్తూనే వుంటాడు శాస్త్రి; అంతరం చెడకుండా వుండేందుకు జాగ్రత్త పడుతూనే.

షర్బతు పుచ్చుకున్నా రిద్దరూనూ.

"ఏదో బాధ పడుతున్నట్టున్నావు. రోజూలా లేవు." అని శాస్త్రి కుర్చీలో వెనక్కి చేరబడ్డాడు.

దానర్థం చెప్పక తప్పదని.

అయినా చెప్పే విషయమా, యిది ?

చెప్తే పరిష్కారమయ్యేదా?

సుబ్రమణ్యం కళ్లజోడు తీసి చేతి రుమాల్తో తుడుచుకుని ఆలోచిస్తూ అటువేపు చూస్తున్నాడు. ఇందులో తను బాధపడ వలసింది ఎంత ఉన్నదీ యింకా తేలలేదు. ఈ సమస్య ఒకరికీ అందరికీ సంబంధించదని అనుకోలేక పోతున్నాడతను. ఇంటిది మూర్ఖురాలైపోతే పిల్లల భవిష్యత్తూ తన వాతావరణం చెడతాయని అతని భయం. ఎవరికేదిలేదో వారది కోరడం సహజమనీ, అలాకాకశారద అజ్ఞానం లోనే ఆనందం పొందడం అమానుషమనీ బాధ పడుతున్నాడతను.

పెళ్లి అయినప్పట్నుంచీ శారదని అతనికి తెలుసును. అషాఢ మాసానికి అత్తా కోడలూవో గడప దాటకూడదంటే పుట్టింటికి వెళ్ళిన శారద రాసిన ఉత్తరం యింకా అతనికి జ్ఞాపకముంది. చదవనూ రాయనూ చేతవునంటే నిజమే అనుకున్నాడు. గాని "అత్తగారుకు నమస్కారములు; దయ ఉంచవలెను, మీ దాసీ -" యిలాటి అక్షర తప్పులూ అపభ్రంశాలు వుంటాయని వూహించుకోలేక పోయినాడు. ఆ ఉత్తరం చూస్తే సంస్కారం యింట్లోంచి - బహుశా వంటింట్లోంచి ప్రారంభించాలని తెలిసి కష్టమూ అనిపించింది; పేరు శారద అని తల్చుకుని నవ్వుకున్నాడు; అప్పటికి -

తనకీ ఆమెకీ బాధ్యతలూ బరువులూ తక్కువైన ఆరోజుల్లో - పుస్తకాలు తెచ్చీ.. పాఠాలు చెప్పీ, షికార్లు సినిమాలూ తిప్పీ, సత్ప్రసంగాలు చేసీ, శారదని తన ఎత్తుకి - కాక పోతే సగం ఎత్తుకి; 'స్వర్గానికని ఎగురుతే ఉట్టేనా అందుతుంది గనక' - లాక్కు రావాలని ప్రయత్నాలు చాలా చేశాడు. దేని కదే విడగొట్టుకొని సినిమాలని సినిమాలుగా, షికార్ని షికార్లుగా, పుస్తకాల్నీ ప్రసంగాల్నీ కాలక్షేపసాధనాలుగా గ్రహించి మోరకించింది శారద. ఆ నిర్దాక్షిణ్యాన్నీ మనసారా క్షమించాడు సుబ్రమణ్యం.

దాంపత్య జీవనం, ఏకాంతం, కుటుంబ నిర్వహణం, శిశుశిక్షణా, యీ సందర్భాలన్నిట్లోనూ, సుబ్రమణ్యానికి తన వూహలు తన కున్నాయి. అవన్నీ శాస్త్రీయమైనవనీ క్షేమదాయకాలనీ అతని నమ్మకం, తను నమ్మిన వాట్ని తనే ఆచరించలేకపోవడమనే పరాజయాన్ని ఆముదం లాటి శారద సంస్కృతిలా దిగమింగుకున్నా డతను.

ఇప్పుడు చూస్తే ఆనాటి కానాడు నవ్వుకునీ క్షమించీ దిగమింగుకునీ వున్న ఘట్టాలే నేడు అడుగు ముందుకి వెయ్యకుండా అడ్డుపడుతున్నాయని తెలుస్తోంది. ఇద్దరు పిల్లల తల్లి శారద యిప్పుడు. సాహిత్యమూ సంగీతం వంటబట్టడం మాట అటుంచి వాళ్ళిద్దరికీ నీళ్ళూ పాలూ చూసి తనకి ఆఫీసు టయిముకి వంట అయ్యేటట్టు చూస్తే చాలన్నట్టుగా వుంది ఆమెకి. తనకైనా పదిమంది గుమాస్తాల సెక్షను; ఇంటికి వొచ్చే పోయే ఆసాములు. ఊం అన్నా ఆఁఅన్నా కలెక్టరూ పి ఏ కబుర్లు పెట్టడం.ఇంటికొచ్చే సరికి జోడూ కోటూ విప్పడానికి ఎవరైనా వుంటే బాగుణ్ణనిపించే టంత వ్యాపకం.

దీనికితోడు ప్రతియేడూ వయస్సు ఒక్కొక్క సంవత్సరం పెరిగిపోతోంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ శారద యిల్లాలూ పేరక్కా అయిపోతోంది. తను జ్ఞానం అనుభవం వృద్ధిచేసుకొని బ్రతుకు పచ్చగా పండించడానికి కొత్త మార్గాలు వెతుక్కుంటున్నాడు. శారద వృద్ధురాలైపోతున్నట్టూ తను మాత్రం యింకా బయల్దేరినచోటే వున్నట్టూ స్ఫురిస్తూ ఎప్పటికప్పుడు శారద దూరమైపోతున్నట్టు బాధ కలుగుతోంది; సమస్య పెద్దదయి పోతోందని భయమూ వేస్తూంది.

ఒకరికి చెప్పుకుంటే యిందులో జరిగే మేలేముందో తెలియడం లేదు. కాలాన్ని వెనక్కి మళ్ళించడం చేతనైతే; ఆమెకి పిల్లలూ, తనకి ఈ బాధ్యతాలేని ఆరోజులే మళ్ళీ యిప్పుడు ప్రారంభమైతే శారద మనస్సు యీడేరే వరకు ప్రొమోషన్లేనా వొదులుకోడానికి సిద్ధం అతను.

ఒరవడి

ఇంట గెలిచి రచ్చ గెలవాలి.

స్నేహితుడుగా అడుగుతున్నాడు శాస్త్రి; విషయం ఏమిటో చెప్పమని. కేవలం స్నేహితుడే అయితే తెలుసు కుందికి పెద్ద అభ్యంతరం లేదు. గృహ, మానసిక, జీవితాల్ని ఆఫీసర్లకి చెప్పుకోడం ఎంత అవసరమైనా అంతగా మంచిది కాదనీ తెలుసు సుబ్రమణ్యానికి. సమయం వొస్తే "నీ గృహ జీవితం యిల్లా వుంది గనక-" అని అనేటందుకు అధికారి వెనకాడడని అతను కొందరి విషయంలో గమనించేడు.

"ఏం లేదు సార్. అయామ్ ఆల్‌రైట్," అన్నాడు సుబ్రమణ్యం.

"ఏమిటి? కలెక్టరు డాక్టరవుతున్నారా?" అంటూ శాస్త్రిభార్య సుశీలాదేవి ప్రయివేట్ రూమ్‌లోకొచ్చింది.

"నమస్కారమండీ-" అని సుబ్రమణ్యం లేచినిలబడ్డాడు

"నమస్కారం"; అంటూ ఆవిడ కూచుంది. "ఎవరికీ, బాగులేదంటున్నారూ?"

సుబ్రమణ్యమూ కూర్చున్నాడు.

"బాగులేకపోవడం కాదు- అతను, ఏదోలా వున్నట్టుంటేనూ - అడిగాను. ఏంలేదంటాడు. నువ్వు చూడు, ఏదో బాధపడుతున్నట్టు లేదూ?" అన్నాడు శాస్త్రి.

సుశీలాదేవి నవ్వింది. "అందుకే, కలెక్టరు డాక్టరవుతున్నారా - అన్నాను.- ఆయనేదో బాధపడితే అదీ మీకే కావాలీ?"

"సుబ్రమణ్యం నా ఫ్రెండన్న సంగతి మర్చిపోతున్నావు !"

"సారీ-"

"చదరంగం తెప్పించమంటారా సార్?" అన్నాడు సుబ్రమణ్యం.

"నో నో - నాకు మూడ్ బాగులేదు-"

"సర్లెండి-" అని సుబ్రమణ్యం కుర్చీలో సద్దుకున్నాడు.

"పిలిపించేరంటే చదరంగమో, ఆఫీసువర్కో అనుకొని వస్తారాయన!" అన్నది సుశీలాదేవి.

"అందుకనే-ఈసారి పిలిపించింది నేనుకాదని చెప్పేస్తున్నాను." అన్నాడు శాస్త్రి , ఆవిడవేపు సాభిప్రాయంగా చూస్తూ.

సుశీలాదేవి సద్దుకుంది - 'మరేనండీ - మీరిన్నిసార్లు వచ్చారుగాని మీవాళ్లని తీసుకొచ్చారు కాదు, ఒకమారైనా. అసలు ఇవాళ ఆదివారం కదా, కారుపంపిస్తే వొచ్చేస్తారేమో అనుకున్నాం, మళ్ళీ మీరేమయినా ప్రోగ్రామ్ ఫిక్సప్ చేసుకున్నారేమోనని మిమ్మల్ని కబురుపెట్టాం.'

సుబ్రమణ్యం సిగ్గుపడిపోతున్నాడు.

"మీ మిసెస్ చాలా లక్కీ వుమన్ అనుకుంటూ వుంటామండీ మేము. మంచి మంచి పద్యాలూ గేయాలూ రాస్తారు మీరు. అవన్నీ ఫస్ట్‌హేండ్‌గా ఆవిడ చూస్తారు. చక్కటి సంగీతం పాడుతారు మీరు. ఇంట్లో యింకా ఫ్రీగా పాడతారనుకుంటా. అంతా ఆవిడ అదృష్టం కదా! అడగడం మరిచిపోయాను; ఆవిడా పాడతారు కాబోలు; అల్లా అయితే ఇహ అడగాలా? మీ జీవితమే వొక చక్కని యుగళగీతం-"

సుబ్రమణ్యాం మొహమాటపడి "... ... ల్లేదండి..." అన్నాడు.

"పోనీ, మీ పద్యాలూ అవీ ఆవిడకి ముందు చదివి వినిపిస్తారండీ?"

చాలా ఉత్సాహంగా అడుగుతోందామె. ఆమెని మొదలంటా నిరుత్సాహపరచలేక అబద్ధమే ఆడడానికి సమకట్టాడు సుబ్రమణ్యాం.

"అప్పుడప్పుడు-"

"అప్పుడప్పుడేమిటి- అన్నీ ఆవిడ ఔనంటేనే నలుగుర్లోకి వస్తాయనుకుంటాను. మాతో అల్లా అంటారుగాని, మొన్న మీ 'సువర్ణ కంకణం, లో ఆ మాట రాశారుగా!"

సుబ్రమణ్యాం యిబ్బంది పడ్డాడు.

"అనేకం రాస్తామండీ; అన్నీ సంసారంలో అనుభవానికి వొచ్చినవే అంటారా? అలా అయితే ఎంత రాయగలం గనక! మా సంసారాలనగా ఎంత, వాటి స్కోపనగా ఎంత? ఒక రచనతో అయిపోతాయి. నిజం చెప్పాలంటే నేను మా ఆవిడ గురించి నిజమైన వాక్యం ఒక్కటి రాయలేదండీ, "మా ఆవిడ" అనే పాత్రని ఎన్నిసార్లు చిత్రించినా-"

"అయితే మీ ఆవిడ ఏమీ చదువుకోనేలేదంటారా?"

"ఏం చదువులండీ - ఎక్కడో అగ్రహారాల్లో పుట్టడం, ఊళ్లో వున్నంతవరకూ చదువుకోడం, పోనీ పెళ్ళయ్యేకయినా కాస్త జ్ఞానం వొచ్చేలా ఏదేనా చదివిద్దామంటే అవదండీ! ఎన్ని పన్లు, ఎంత బాధ్యత! నా ప్రాణం విసుగెత్తింది గాని దాన్ని కొంచెం కూడా ఎడ్యుకేట్ చెయ్యలేకపోయేనండీ. ఇంకా పూర్వకాలపు ఐడియాలూ చేదస్తాలూ పెట్టుక్కూచుంటుంది -"

చెప్పదలచుకోలేని యీ మాటలు చెప్పడానికిష్టంలేని సందర్భంలో చెప్పవలిసే రావడంవల్ల -సానుభూతి బాధని ఎక్కువ చెయ్యడంవల్ల - వినీవినగానే ఒకరు నమ్మే స్వరంలో వొచ్చాయి. అతను నేలకిచూస్తూ విషయం నెమరు వేసుకుంటున్నాడు.

శాస్త్రీ, సుశీలాదేవీ ముఖాలు చూసుకున్నారు. వారి నేత్రాలు మాత్రం నిశ్శబ్దంగా నవ్వుకుని ఏమో భాషించుకున్నవి.

"అంచేత మీలాంటి పెద్దల దగ్గరికి ఆ ఆత్మలేని ఆకారాన్ని తీసుకొని రావడానికి సిగ్గువేస్తుంది. సరదాగా కాలక్షేపం చెయ్యడానికి నాకదృష్టం లేదు - " అని ముగించాడు సుబ్రమణ్యాం.

"నువ్వు స్వయంసిద్ధ చదవలేదుటోయ్?" అన్నాడు శాస్త్రి చిరునవ్వుతో.

"స్వయంసిద్ధంటే బెంగాలీ నవలేనాండీ?"

"అదే, తెలుగులోకి ట్రాన్స్‌లేట్ అయిందిగా!"

"చదివాను. అదివొక అపశ్రుతిగా భావిస్తున్నాన్నేను"

"ఎందుకనేం?"

"ఆ నవల్లో పురుషుడు మందుడయినా స్త్రీ అతణ్ణి సరిదిద్దగలదని నిరూపించబడింది. అసలు పురుషుడు అందులో వివరించినట్టు ఏదో మందో మాకో పెట్టేస్తే తప్ప మొద్దుబారిపోడు; అలా అయినపక్షంలో స్త్రీ కాదుగదా జేజెమ్మ అయినా అతణ్ణి బాగుచెయ్యలేదు. మనదేశంలో స్త్రీ పురుషుడి జ్ఞానానికే వొక పరీక్ష. పురుషుడు మూర్ఖుడైతే తనూ ఆ మూర్ఖత్వాన్ని పంచుకొని వినాశనానికి

దారితీస్తుంది గాని అభివృద్ధి సున్న! ఆడది మనదేశంలో అంత బలమైన వ్యవస్థ!

మళ్ళీ శాస్త్రి, సుశీలాదేవీ ముఖముఖాలు చూసుకున్నారు.

“తమరు నన్ను క్షమించాలి-!” అన్నాడు సుబ్రమణ్యం సుశీలాదేవిని ఉద్దేశించి.

ఆవిడ చిన్నగా నవ్వింది.

“మరి, ‘ముదితల్ నేర్వగ రాని విద్యగలదే, ముద్దార నేర్పించినన్’ అని రాశారు గదుటోయ్, మనవాళ్లేనూ?” అన్నాడు శాస్త్రి.

“రాయడానికేమిటిసార్, ఎన్నేనా రాస్తారు; రాసి తృప్తిపడ్డం వొకటి అలవాటయిపోయింది అనాది నుంచీనూ. జీవితంలో పొందలేనివి రచనల్లో చదివీ సినిమాల్లో చూసీ తృప్తి పడుతున్నారు ప్రజానీకం కూడాను!” అని నవ్వాడు సుబ్రమణ్యం.

శాస్త్రి తన పంకించాడు. “చాలా సొండుగా చెప్తున్నాడు!”అన్నాడు, సుశీలాదేవిని వుద్దేశించి, మృదువైన హేళన ధ్వనిస్తూ.

“నేనెంతవాడిని, చెప్పడానికి! స్త్రీ విద్య మనకి జనాభా కంటె పెద్ద సమస్య! ఇది సాధిస్తే అది సాధించక్కర్లేదని నా నమ్మకం. స్త్రీలని కరెక్టుగా ఎడ్యుకేట్ చేస్తే పాప్యులేషన్ ప్రాబ్లెమ్ వాళ్లే సాల్వు చేసుకుంటారు. ఎడ్యుకేషనంటే ఇక్కడ అక్షరాస్యత కాదు; జ్ఞానం! వాళ్ళలో ఎడ్యుకేషను రానంత కాలమూ యీ జనాభా సమస్య వాళ్ళకి అర్థమూ కాదు, అర్థంచేసుకోమని మనం అరచినా ప్రయోజనమూ లేదు! నెహ్రూ అంతటి నాయకుడూ చరిత్రకారుడూ - ఏ దేశం యొక్కస్థితిగతులేనా ఆ దేశంలోని స్త్రీల లివింగుస్టాండర్డుపై ఆధారపడి వుంటాయన్నారు. మనదేశంలో స్త్రీలకి లివింగూ లేదు, స్టాండర్డు అంతకన్నా లేదు!” అని సుశీలాదేవి వేపు చూశాడు సుబ్రమణ్యం.

“ఆడది మగవాడి జ్ఞానానికే వొక పరీక్ష అన్నారండీ మీరు- మరైతే ఈ పరీక్షలో మీకెన్ని మార్కులొచ్చే యంటారు?” అందావిడ చిరునవ్వుతో.

“తమరు నన్ను హేళనచేదామని ప్రయత్నిస్తున్నారు. విషయం మార్చడానికి నాకభ్యంతరం లేదు...”

“క్షమించండి- అల్లా అయితే అడగను. విషయమే కానీండి,” అంది సుశీలాదేవి మళ్ళీ అదే నవ్వుతో.

సుబ్రమణ్యం అప్పటికి గ్రహించాడు; హేళన పడనే పడ్డానని, - “హేళన అనుకున్నా తప్పదనుకోండి- అందరితో బాటుగా నేనూ యిందులో ఫేలయినాను.” అన్నాడు.

“అందరితోబాటు - అంటే?” అన్నాడు శాస్త్రి.

“అందరూ, ఆశేష ప్రజానీకం! రోజూ తమ తమ స్త్రీల మూర్ఖత్వంతో పోట్లాట మానుకున్న పురుషానీకం!”

“అలా చెప్పుకిందికి నీకు చిన్నతనంగా లేదూ?”

“- ఏంచేస్తాం?”

“ నేనయితే అందర్లో కలిసిపోకుండా ఏదోఒకటి చేస్తాను గాని అలా ఊరుకోను......” అని సుశీలాదేవి వేపు చూశాడు శాస్త్రి.

వారిద్దరూ మెత్తగా నవ్వుకున్నారు.

✣ ✣ ✣

"అయిదేళ్ళ క్రిందట - ఐ.ఏ.యస్. అవగానే నేనిక్కడికే ట్రెయినింగు కొచ్చేను. నేనసలు ఈ సర్వీసుకి రాకూడదనే అనుకున్నాను; మొదట్లో. ఇంగ్లండులో హెడ్డాఫీసు వున్న ఓ మందుల కంపెనీ బొంబాయి బ్రాంచీలో కెమిష్టుగా వుండేవాణ్ణి. మంచి జీతమూ, బంగళా, కారూ, అన్ని ఎమినిటీసూ వుండి జీవితంలో నాకింతకంటె ఏమీ అక్కరలేదనిపించింది. అప్పటికి నా వయస్సు యిరవై ఎనిమిది; జీతం ఎనిమిది వందలు.

సడన్‌గా నన్ను గ్రేడ్ "బి"నుంచి గ్రేడ్ "ఎ"కి మారుస్తూ సింగపూర్ వేసే మన్నారు. బాంబేలో వున్న మా బాస్ యురపియన్; వెళితేనే మంచిదన్నాడు. ఇంతలోనే ఐ.ఏ.యస్ స్పెషల్ రిక్రూట్ మెంటు పడింది. వీళ్లు సింగపూర్ వెయ్యడమూ, వెళ్దామా మాన్దామా అన్న తర్జన భర్జనా, చూసుకుని ఏమయితే అయిందని కట్టేను. పరీక్ష రాయడమూ సెలక్షన్ రావడమూ అన్నీ తొందరగా జరిగిపోయాయి. దీంట్లో జీతం బాగా తక్కువైనా వెంటనే ఆంధ్రదేశంలో పనిచేసే అవకాశం. దాంట్లో జీతం యెంతైతే యివ్వనీ; శెలవు పెట్టుకుంటే తప్ప దేశం గడ్డ తొక్కడానికే వీల్లేదు. అనుకోకుండా వెయ్యిపన్లుచేసే కన్న అనుకొని వొక్కపని చెయ్యడం నాకు మొదట్నించీ ఒక తృప్తి. ఆ నౌకరీకి రిజిగ్నేషన్ యిచ్చేశాను.

"సెలక్షన్ అవగానే ఆంధ్రకే ఎలాట్ చేసి; నన్ను ట్రెయినింగుకి యీ కలెక్టరేట్‌కే వేశారు. మొదటి రెండు వారాల్లోనే సర్వే ట్రెయినింగ్ కమ్మన్నారు. నాకప్పటికింకా "చదువు ఉద్యోగంలో ఉపయోగ పడకపోతే ఎందుకూ?" అన్న తత్వం పోలేదు. కెమిస్ట్రీ ఆనర్సు చదివి ఫస్టుక్లాసు తెచ్చుకున్న నాట్నించీ, మందుల కంపెనీ వుద్యోగానికి రిజిగ్నేషన్ యిచ్చే రోజువరకూ సబ్జెక్టు వుపయోగం క్షుణ్ణంగా వొంటబట్టిన నేను పూర్తిగా కొత్త వాతావరణంలో పడ్డాను ఇక్కడ కెమిస్ట్రీ ఎకనామిక్సూ రెండూ వొకటే. నాపని నేను చేసుకుపోయే వాణ్ణక్కడ స్వతంత్రంగా. ఇక్కడ అలాకాదు నిలువెల్లా అధికారం; ఎంతోమంది జీవితాలు మన చేతుల్లో వుండడం; మనం తప్పటడుగు వేస్తే ఎవడో బతుకు చెడి బజార్లో పడడం - ఇవీ పరిస్థితులు. నాకు ప్రాణాంతకంగా వుండేది.

"సర్వే ట్రెయినింగుతో ప్రారంభించిన నేను ఆ సర్వేయర్ని కొంచెం దగ్గిర చేశాననక తప్పదు. దానిక్కారణం ఇదీ అంటూ లేదు. అంత వరకు నేనుండే ప్రపంచానికీ ఆ తరువాత నేనుండే ప్రపంచానికీ వొక వంతెన నిర్మించుకోవాలి; దానికి ఎవడో ఒకడు కావాలి. బాంబే వొదిలి పది రోజులయిందప్పటికి. ఆ సర్వేయరు పేరు శంకరమో ఏదో ఉండాలి. చాలా తెలివైనవాడని చెప్పకతప్పదు. అనుభవాన్ని అణా పైసల్తో సహా వుపయోగించుకొనే మనుషులుంటారనడానికి అతనే సాక్ష్యం. నా మట్టుకు నేను. అతని ద్వారా సర్వే సబ్జెక్టు కంటె క్షుణ్ణంగా ప్రజలూ వాళ్ళ మనస్తత్వాలు; ఆఫీసుతో, ఆఫీసర్లతో వాళ్ళ అనుబంధాలూ; ఆఫీసర్లూ వాళ్ళ నెదుర్కొనే సమస్యలూ వాటిలోతూ, యీ వివరాలు ఎక్కువ తెలుసుకున్నాను. సర్వేయరుకు పాలనా రంగంలో స్థానం లేకపోవడంవల్ల అనుకుంటాను; అతని అభిప్రాయాలు అతను పదునుగా చెప్పగలిగాడు; ఇప్పుడు అవి నిష్పాక్షికమైనవనీ నేను గ్రహించ గలుగుతున్నాను.

"మాది అమలాపురం దగ్గిర చిన్న పల్లెటూరు. నీకు తెలుసుగా మామిసెస్‌దీ - అంటే యీవిడదీ-ఆవూరే. వైదిక కుటుంబం మాది; నా పేరే చెబుతుందామాట. మా వంశంలో మా తరం వరకూ, (ఎలాగో ఊరు దాటినా) అమలాపురం దాటి చదువుగాని జ్ఞానంగాని లేవు.

కట్టుకుపోయినంత ఆస్తి వున్నా చదువులేకపోవడం నాకు నచ్చక మావాళ్లంతా దెబ్బలాడినా కాలేజీకి, యూనివర్సిటీకి, వెళ్లగలిగాను గానీ మా పెళ్లి మాత్రం అంతకమునుపే అయిపోయింది. స్టూడెంటుగా నాకున్న కాన్సెంట్రేషన్ నీకు తెలుసుగా, పెళ్ళీ పెళ్ళామూ, తల్లీ తండ్రీ- ఏ బంధమూ వుందన్న సంగతే మరిచిపోయి ఆనర్సు ఫస్టుక్లాసు సాధించాను. రిజల్టువచ్చింది. వేసంగిలో మాకొబ్బరి తోటల్లో జీవితంలో మొదటిసారిగా సుఖవంతమైన గాలి పీలుస్తున్నాం. సరదాగా పెట్టిన అప్లికేషనుకి బొంబాయి ఇంటర్వ్యూకి రమ్మని అక్కడే ఆర్డర్సు యిచ్చేరు.

కొన్నాళ్ళు కొత్తమూలాన్ని; కొన్నాళ్ళు ఇంట్లో చికాకులు మూలాన్ని; మా మిసెస్‌ని బాంబే తీసుకెళ్ళలేదు. ఇంతట్లోకే నన్ను ఒక టెక్నికల్ ట్రెయినింగ్ పొందడానికి స్విట్జర్లండు వెళ్ళమన్నారు, కంపెనీ వాళ్లు. మూడు సంవత్సరాలు విదేశాల్లోనే గడిపాను; ట్రయినింగు ఏణ్ణర్థమూ, లండన్‌లో ఫ్యాక్టరీలో ఏణ్ణర్థమూనూ, దాంతో నాకు ప్రోస్పరిటి తప్ప లైఫ్ లేకుండా పోయింది. విసుగుపుట్టేది; ఎప్పటికప్పుడేను. ఇల్లులేదు; ఇల్లాలు లేదు. అతి స్వల్పమైన పరిచయం నామిసెస్‌తో నాకు. అయినా వొక ప్రిన్సిపుల్ ఏర్పడి పోయింది. ఆ ప్రిన్సిపుల్‌తో కట్టుకున్న మనిషిని నేను యించుమించు మరిచిపోయేను. అతికష్టం మీద మొహం జ్ఞాపకమొచ్చేది, వూహించుకుంటే. ఈ స్థితి నాకు భయంకరంగా కనిపించింది. నా ప్రోస్పరిటి, నా సుఖం నా భార్య పంచుకోక పోయినప్పుడు నేనభివృద్ధి చెందేం లాభమని బాధపడ్డాను ఏదో మడతవేసి బాంబేకి తిరిగొచ్చేను; కాపరం పెట్టుకోవాలని. లేకపోతే మరో ఆర్నెల్లలో పిచ్చి ఎత్తేది కాబోలు నాకు.

"సరే జాయిన్ అయిన ఎనిమిది నెలల్లో ట్రెయినింగ్ అయింది. ఎక్కడో సబ్‌కలెక్టరుగా పోస్టింగు యిస్తారన్న మాట; ఇంతట్లో వొచ్చిందొక రిపబ్లిక్ డే. ముందుగా రెవిన్యూ స్పోర్ట్సు అవీ అయ్యాయి, ఆవేళ ప్రెయిజ్ డిస్ట్రిబ్యూషన్ చెయ్యాలి. అసలీ వ్యవహారం అంతా కలెక్టరే స్వయంగా చూసుకునే వాడు. నారాయణన్ అని ఒక ఐ.సి.యస్. అప్పుడిక్కడ కలెక్టరు. ఏదో యాక్సిడెంటులో మెడ్రాసులో వాళ్ళ కుర్రాడు ఇన్వాల్వు అయితేనూ సమయానికి వెళ్ళిపోయేడు. ఫార్మాలిటీస్- అదే ఫ్లాగ్ హోయిస్టింగూ అవీ, నన్ను చెయ్యమన్నారు. ఉదయం అయిపోయింది, అదంతా. మధ్యాన్నం ప్రెయిజ్ డిస్ట్రిబ్యూషన్ ఉంది. ముందుగా ఒక హుజూర్ హెడ్గుమాస్తా వచ్చి మా మిసెస్ ప్రెయిజ్ డిస్ట్రిబ్యూషన్ చెయ్యాలన్నాడు. నేను వీలుండదు. పొమ్మని పంపేశాను.

మరో గంటకి సర్వేయరు శంకరమ్ వొచ్చి చిన్న వుపన్యాసం లాంటిదియిచ్చి, ఎలాగైనా ఆవిణ్ణి వొప్పించాలన్నాడు. ఆర్.డి.ఓ. గారు. పి.ఏ.గారు; ఎందరున్నా తమ సాటిరాదండీ అన్నాడు. ఐ.ఏ.యస్. ఆఫీసరు సతీమణితో సహా ఊళ్ళో వున్నప్పుడు యిటువంటివి యింకొహరు చెయ్యించడానికి భయపడతారన్నాడు. "అభ్యంతరం లేకపోతే ఆవిడతో తనే మాట్లాడి ఎలాగో ఒకలాగ ఆవిడ్ని వొప్పిస్తానంటాడు.

నేను యిరుకులో పడ్డాను. ప్రపంచంలో ఏ ఉన్నతికైనా నాకు అర్హతవుంది; లేకపోయినా నేను శ్రమపడి సంపాదించుకోగలనవి. కాని మా మిసెస్‌ని గురించి మాత్రం- ఎవరితోనూ చెప్పడానికి వీల్లేని వ్యవహారం. ఆనర్సు చదవడానికీ ఉద్యోగం చెయ్యడానికి టెక్నికల్ ట్రెయినింగ్ పొందడానికీ నేను ఆమె నుంచి చాలాదూరం వెళ్లాను. యీ దూరం మా యిద్దరిమధ్యా ఏర్పడిన దూరంలో వెయ్యోవంతయినా లేదని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. నేను పైకి పైపైకి, యింకా మీదికి వెళ్తూవుంటే ఆవిడ అట్టడుగున బయల్దేరిన చోటే వుండిపోయింది. నాలో ప్రవహించే ఆలోచన్లూ నావిజ్ఞాన స్థాయీ అర్థమయ్యే యోగ్యత ఆమెకు లేనేలేదు. నా గురించి ఆవిడ అభిప్రాయమల్లా

గౌరవించ వలపిన వొక మనిషి. నా మాటలు ఆవిడకి అర్థమవడం అటుంచి ఆవిడ సంభాషణ విని నేనెంతో సిగ్గుపడేవాణ్ణి. "మీ చిన్నన్నయ్య పెళ్లాం నాగరం చేయించుకుందండోయ్" అనో 'ఎంత వెధవాడపడుచైనా విశ్వనాథ శాస్త్రులు గారమ్మాయి వరస బావులేస్మండి-" అనో వుండేది ధోరణి. వైదికాచారాలూ, సంప్రదాయాలు సరేసరి. అసిస్టెంటు కలెక్టరుగా ట్రెయినింగుకి రావడమే విడిగా కాపరం సొంతంగా పెట్టడం. ఏం తెచ్చుకుందో తెలుసా? చిన్న మహలక్ష్మితొట్టె, పసుపూ, కుంకము; ఆధ్యాత్మ రామాయణ కీర్తన్లూ. నాకు ముళ్లు గుచ్చుకున్నట్టుగా వుండేది. కలెక్టరు సతీమణి కలెక్టరుకు తగినట్లుగా ఉండాలని జనంకోరడం సహజం. ఏంచేద్దామనుకున్నా నాకే తలములిగి తాటి ప్రమాణమంత పని. యీ విషయాలు ఎవరికి చెప్పకపూర్వమే, ఏం చెయ్యక పూర్వమే పరీక్షా సమయం వొస్తుందని అనుకోలేదు. గడిచిపోయిన దండుగైపోయిన యిన్ని సంవత్సరాలూ గుర్తుకొచ్చి ఏడ్చుకున్నాను.

ఏదో వొకటి చెప్పి పంపాలి శంకరంగారికి. ఆయన కదల్డం లేదు. ఇక్కడ మొదటిసారిగా కాన్ఫిడెన్సులోకి తీసుకున్న వ్యక్తి అవడంవల్ల గాబోలు, అతనితో అబద్ధం చెప్పడానికి ప్రాణం వొప్పలేదు. మా ఆవిడ ఆ గౌరవానికి తగదు; ఇలాటి సంగతి అని చెప్పేసరికి అతను ఇంచుమించు ఏడ్చినంత పని చేసేడు. ఆనాడు అతనన్న మాటలుగాని చేసిన చేష్టలుగాని నేను ఎప్పటికీ ఎవరితోనూ చెప్పలేను; మరిచిపోలేను.

ఫలితం యేమిటీ? సామం భేదం దండం మూడు వుపాయాలతోటీ యిరవై నాలుగునెల్లు కృషిచేసి వో క్రొత్త మనిషిని సృష్టించేను. అందుకోసం ఆవిణ్ణి ఎవరితోనూ చెప్పుకోకూడని ఆగౌరవం చేశాను; ఎవరికీ యివ్వని మర్యాద యిచ్చేను; ఎక్కడా చూపని హైన్యం చూపేను; వివిధ సందర్భాల్లో. అదంతా నిజం కోసం నటన- ఎదురుగుండా మనిషుంది ప్రశ్నించిచూడు. ఆవిడ అది పూర్వ జన్మం అంటుంది తప్ప నాలుగేళ్ల క్రితం జరిగినవిషయమని వొప్పుకోదు. ఇప్పుడు-సంస్కృతంలో ఆమాత్రం యీమాత్రం కావ్యం అర్థమైపోతుంది తెలుగులో విసుగులేకుండా వేదిక మీద గంటకి తక్కువలేకుండా మాట్లాడగలదు; ఎవరేనా యింగ్లీషులో మాట్లాడితే తడుముకోకుండా కరెక్టుగా సమాధానం చెబుతుంది.

శాస్త్రి సిగరెట్టు తీసి వెలిగించాడు.

సుబ్రమణ్యాం నదిలో స్నానం చేస్తున్నట్టు కొట్టుకుపోతునట్టు ఆనందంలో ఆశ్చర్యంలో సంభ్రమంలో సందేహంలో మునుగుతున్నాడు. అతని నోట మాట రాలేదు. అప్రయత్నంగా సుశీలా దేవి వేపు చూశాడు. కుర్చీని చిద్విలాసంగా కాళ్లతో వెనక్కీ ముందుకీ వూపుతోందామె.

"ఎవరో అదృష్టవంతులకి గాని మా లాంటి వాళ్ల కివన్నీ ఎక్కడ సాధ్యమండీ? ఏదో యిలా వెళ్లవలసిందే-"

రెండుసార్లే పీల్చిన సిగరెట్టు అర్పేశాడు, శాస్త్రి; కోప సూచకంగా.'చాతకాకపోతే సరి;' అంటూ.

సుబ్రమణ్యాం మాట్లాడలేదు.

"మాలాంటి వాళ్లూ మీలాంటి వాళ్లూ అని ఎక్కడా లేదు మిస్టర్ సుబ్రమణ్యాం; అంతా వొకటే. కాకపోతే పరిసరాల్ని బట్టి కొంచెం తేడా కొంత కాలం రావచ్చు. బుద్ధి తెలిసి, గట్టిగా ప్రయత్నం చేస్తేనేగాని ఆనర్సులో క్లాసు రాదని తెలిశాక కూడా చదవకపోవడమేం?"

సుబ్రమణ్యాం మాటాడలేకపోయాడు.

ఒరవడి

"-అదీ అదృష్టమేనా? మన చేతుల్లో వున్నది పాడుచేసుకుని ఆనక అదృష్టం లేదని అనెయ్యడం మనిషి తెలివి తక్కువకి నిదర్శనం-పోనీ చూదాం; నీవయస్సెంత?"

"ముప్పయిరెండు."

'మీ ఆవిడ వయస్సు పాతిక దాటి వుంటాయి. ముప్పయేళ్ళకే టైమయి పోయిందనుకుంటు న్నావా? యింకా డెబ్భయ్యేళ్లున్నాయి. మొదలు పెట్టి చూడు; ఎందుకు చెయ్యలేరో నేను చూస్తాను. రెండేళ్ళలో నువ్వనుకున్న పని కాకపోతే నేనెక్కడుంటే అక్కడికిరా. నష్టానికి పరిహారం నేనిస్తాను! యివ్వకపోతే ఫలానా శాస్త్రి వల్ల యింత నష్టపోయానని అనుకుందువు గాని!'

"ఎంత మాటండి!"

"నువ్వు స్వయంసిద్ధ అప్రశ్రుతి అన్నావే; అదీ "ఎంత మాట" - అనుకో వలసిన మాట! నీ కావ్యాలూ గేయాలూ సంగీతం ఆమె బోధ పర్చుకో లేదనే నువ్వంత బాధ పడిపోయి ఈ జన్మకింతే అని మొగం వేలేస్తే నీకన్న పెద్ద పన్లు చేసే వాళ్లు ఏమయిపోవాలి! ఒక దేశనాయకుడు తన భార్యకీ తనకీ అగాధమంత అడ్డం వుందనీ తన కాటంకం వస్తోందనీ తెలుసుకుని ఆవిణ్ణి ఎలా మార్చాడో చదవలేదా? ఇందులో నువ్వు నిరుత్సాహ పడవలసిన దానికంటె ధైర్యంగా చెయ్యవలసిందే ఎక్కువుంది. నువ్వే అన్నావుగా. జనాభా సమస్య కంటె స్త్రీ విద్య సమస్యే క్లిష్ట మైందనీ, దానికంటె ముందు ఇది విడగొట్టే దాని జోలికే పోనక్కర్లేదని - నాకు చాలా ఆనందంగా వుంది. కాని గవర్నమెంటు కాదు యీ సమస్యల్ని పరిష్కరించగలిగేది, మీరే. ఎన్ని యాక్టులు చేసినా నీ భార్య చదువుకోదు; నువ్వు శిక్షణలో వుంచుతే వెంటనే చదువుతుంది. - అందుకని - ప్రారంభం చెయ్యి. త్వరగా!"

"ఇహ ఆపు చెయ్యండి, ఆయన బోరవుతున్నారేమోనూ. మీరు నమ్మకంతో చేసిన పనిగనక మీకా వుత్సాహమూ వుత్కర్షానూ. వాళ్ల పరిస్థితులేమిటో వాళ్లేమిటో? పాపం యిద్దరో ముగ్గురో పిల్లలు గాబోలావిడకి. పదిగంటలకి వంటవండడమే కష్టం. యీన ఆఫీసుకి లేటుగా వస్తే మీరే సంజాయిషీ అడుగుతారు. మరీ బలవంతం చెయ్యకండాయన్ని- ఏం చేసుకోవాలో ఆయనకి మాత్రం తెలీదూ?" అంది సుశీలా దేవి ముగింపుగా.

సుబ్రమణ్యాం లేచాడు.

"వెళ్లొస్తానండీ, నమస్కారం."

అతని కంటికి ఆ భార్యా భర్తలిద్దరూ తనకి ప్రత్యేకం జ్ఞానోపదేశం చేసేటందుకు విజ్ఞాన తేజస్సుతో వెలిగిపోతూ వచ్చిన ఆది దంపతుల్లా కనబడ్డారు. వందనాలర్పించడానిక్కూడా తీరిక లేనట్టు అతని హృదయం దేనికో తొందర పడసాగింది.

"అరె, అప్పుడే వెళ్తున్నావా?"

"ఔను సార్. వెళ్లాలి"

"కొంపదీసి యివాళ్టినుంచే మొదలు వెడతావా, ట్యూషన్?"

"మరేనండి. ఎందుకంటే మంచిపని ఏదైనా తలపెడితే వెంటనే మొదలెట్టెయ్యాలట."

"ఎవరా అన్నది?"

"రావణబ్రహ్మ. శెలవు" ✳

*( " ఆంధ్రప్రదేశ్ " మాసపత్రిక : ఆగస్టు 61 )*

(1960లో నా దగ్గిరకి ట్రెయినింగ్ కొచ్చిన ఐ.ఏ.ఎస్. స్పెషల్ రిక్రూటీ కీ॥శే॥ రాణీ మహదేవ శాస్త్రి జ్ఞాపకార్థం)